క్లుప్తంగా

జనసేన వైరా ఇన్‌చార్జ్‌గా సంపత్ నాయక్



నియామకపత్రం అందుకుంటున్న సంపత్

వైరా: జనసేన పార్టీ వైరా నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా డాక్టర్ సంపత్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సోమవారం ఏపీలోని మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో సంపత్ నాయక్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సంపత్ నాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేసి అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై ప్రభుత్వంతో పోరాడుతానన్నారు.


సత్తుపల్లి ఇన్‌చార్జ్‌గా బండి నరేష్



బండి నరేష్

సత్తుపల్లిరూరల్: జనసేన పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బండి నరేష్ నియమితులయ్యారు. ఈ మేరకు బండి నరేష్‌కు పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఉత్తర్వ్యాలు అందించారు.

రూ.75వేల విలువైన శఠగోపం వితరణ



సత్తుపల్లి: మండలంలోని రుద్రాక్షపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి స్థలదాత దాసరి జైపాల్‌రెడ్డి భార్య దాసరి శ్రీలక్ష్మిరెడ్డి తన తల్లి అల్లా రెడ్డి కమలమ్మరెడ్డి పేరిట శఠగోపం అందజేశారు. రూ.75వేలు విలువైన 358 గ్రాముల వెండి ఉపయోగించి విష్ణు పాదాలతో కూడిన ఈ శఠగోపాన్ని తయారుచేయించారు.

కూలీలకు ఇబ్బంది లేకుండా చూడాలి

తల్లాడ: కొన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల వల్ల ఉపాధి కూలీలకు సమస్యలు తలెత్తుతున్నాయనీ, కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం రెడ్డెం వీరమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు పని దినాలు కల్పిండంలో ఫీల్డ్‌అసిస్టెంట్లు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో మండలంలోని ఉపాధి కూలీలందరికీ వేసవి ఎండకు ఉపశమనంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డా శ్రీనువాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, రైతు బంధు మండల కన్వీనర్ దుగ్గిదేవర వెంకట్‌లాల్, సర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

వైరా: ఈ నెల 14 నుంచి 16 వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో జరిగే తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం వైరాలో ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణ తరగతులకు 33 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. రైతాంగ సమస్యలపై వ్యవసాయ విధానాలు ప్రభుత్వ తీరుపై ఈ శిక్షణలో చర్చించనున్నట్లు తెలిపారు.

బాలుడిపై పంప్ ఆపరేటర్ దాడి

కారేపల్లి: నల్లాల ద్వారా మూడురోజుల నుండి నీళ్లు ఎందుకు వదలడం లేదని ఓ వ్యక్తి ప్రశ్నించగా, పంపు ఆపరేటర్ విచక్షణ కోల్పోయి ఆయన కుమారుడిపై దాడి చేశారు. మండలంలోని మేకలతండాకు చెందిన ధర్మా గ్రామపంచాయతీ పంప్ ఆపరేటర్ వీరన్నను నీళ్లు రాని విషయమై సోమవారం రాత్రి ప్రశ్నించాడు. దీంతో కోపోద్రిక్తుడైన వీరన్న ధర్మాపై దాడికి యత్నిస్తుండగా అడ్డొచ్చిన ధర్మా కుమారుడు జస్వంత్‌పై కర్రతో దాడి చేశాడు. దీంతో జస్వంత్ కుడిచేతికి తీవ్రగాయం కాగా, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిజియోథెరపీ సేవలు ప్రారంభం

వైరా: స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉన్న భవిత ప్రత్యేక అవసరాల పిల్లల కేంద్రంలో మంగళవారం ఫిజియోథెరపీ సేవలు ప్రారంభమయ్యాయి. మండల విద్యాధికారి కొత్తపల్లి వెంకటేశ్వరరావు ఈ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.శాంతికుమారి, పీఎస్ ప్రధానోపాధ్యాయురాలు స్వప్న, ఫిజియోథెరపిస్ట్ జి.వసంత, ప్రత్యేక ఉపాధ్యాయులు రవి, అజిత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతుల అరిగోస!

పూడుకుపోయిన కల్లూరు పెద్ద చెరువు తూము

- మరమ్మతులు చేపట్టకపోతే ఈ ఖరీఫ్ ప్రశ్నార్థకమే..
- రెండు పంటలకు నీరందక అన్నదాతల తంటాలు



మరమ్మతులు చేపట్టాల్సిన తూము



కల్లూరు పెద్ద చెరువు

కల్లూరు: కల్లూరు పెద్దచెరువు పెద్దతూము ఆయకట్టు కింద రైతులకు గత ఏడాదిన్నరగా సాగునీరు అందడం లేదు. దీంతో ఏటా రెండు పంటలు పండించాల్సిన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద తూము పూడుకుపోయి, షట్టర్ విరిగిపోయి సాగునీటి సాఫీగా జరగక ఈ సమస్య నెలకొంది. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్ల సాగునీరు అందక పంటలు ఎండిపోయి రైతాంగం నష్టపోయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ ఏడాది అదే పరిస్థితి ఎదురవుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

200 మంది రైతులు.. 450ఎకరాలు

కల్లూరు పెద్దతూము ఆయకట్టు కింద సుమారు 450 ఎకరాల్లో వరి సాగవుతుంది. ఆయకట్టు పరిధిలో సుమారు 200 మందికి సంబంధించిన పొలాలు ఉండగా అంతా చిన్న, సన్నకారు రైతులే. ఆ భూములను కల్లూరు, పుల్లయ్యబంజర్, లోకవరం, కిష్టయ్యబంజర్, గనియాతండా, హనుమాతాండా గ్రామాల రైతులు ఏటా రెండు పంటలు సాగుచేస్తున్నారు. అయితే, తూము పూడుకుపోవడం, షట్టర్ విరిగిపోయిన విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. దీంతో చెరువు నిండా నీరు ఉన్నా రైతులకు గత ఏడాది ఏమీ పాలుపోని పరిస్థితి ఎదురైంది. గత ఏడాది రబీలో సాగు చేసిన వరికి చివరి దశలో నీరు అందక ఎండిపోయింది. ఇకనైనా అధికారులు స్పందించి విరిగిన షట్టర్‌ను సరి చేసి తూము మరమ్మతు పనులు చేయించాలని అన్నదాతలు కోరుతున్నారు. లేదంటే ఈ ఖరీఫ్‌లో కూడా తాము సాగు చేసే పరిస్థితి ఉండదని చెబుతున్నారు.

రెండు ఎకరాల్లో పంట నష్టపోయా..



నేను రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేసాను. అయితే, పెద్దతూము పాడైపోవడం వల్ల వేసిన పంటకు చివరిదశలో సాగునీరు అందలేదు. దీంతో పంట పూర్తిగా ఎండిపోయి నష్టపోయారు. అధికారులు ఈసారైనా స్పందించి తూము, షట్టర్ మరమ్మతులు చేయించాలి.

– ఉబ్బన జానయ్య, కౌలు రైతు

త్వరలో కొత్త షట్టర్ నిర్మిస్తాం..



పెద్ద చెరువు తూము పాడై, షట్టర్ మరమ్మతుకు వచ్చింది. ప్రస్తుతం చెరువులో నీరు ఉండడంతో పనులు చేయలేకపోతున్నాం. నీరు బయటకు పంపిస్తే పట్టణవాసులకు తాగునీటికి సమస్య ఎదురవుతుంది. నీరు తగ్గగానే తూము మరమ్మతులు, షట్టర్ నిర్మాణ పనులు చేపడుతాం.

– ఎం.లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ ఈఈ, కల్లూరు

కాంగ్రెస్‌తోనే సమస్యలు పరిష్కారం



ప్రచారంలో మల్లు నందిని, నాయకులు

ముదిగొండ: కాంగ్రెస్‌తోనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని సీఎల్‌పీ నేత మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని అన్నారు. మండల పరిధిలోని కమలాపురం, అయ్యగారిపల్లిలో మంగళవారం రాత్రి హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర ఖమ్మం చేరుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వల్లూరి వరలక్ష్మి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, ముదిగొండ సొసైటీ డైరెక్టర్ వనం ప్రదీప్తబాబు, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు వల్లూరి భద్రారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిరి అంజయ్య, తాటికొండ రమేష్, ఇలవల పుల్లారెడ్డి, బాబురాం రెడ్డి, పిల్లుట్ల రాఘవ, వల్లబి ఎంపీటీసీ బిచ్చాల భిక్షం, ఎండీ.అజ్గర్, ఇలవల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

మధిర: ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మధిర డిపో వద్ద కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కె వెంకన్న, పద్మావతి మాట్లాడుతూ... ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలని, పెండింగ్ స్కేల్స్ విడుదల చేయాలని కోరారు. సీసీఎస్‌కు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

పోడు సాగుదారులందరికీ పట్టాలివ్వాలి

పెనుబల్లి : పోడు భూములు సాగు చేసుకుంటున్న పేద గిరిజన రైతులందరికీ పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని లేకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు, జాజిరి శ్రీనివాసరావులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్ ఎదుట పోడు సాగుదారులతో ధర్నా నిర్వహించి, తహసీల్దార్ ఎం.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. పార్థసారథిపురంలో 19 మంది, కొత్తలంకపల్లి, గొల్లగూడెం గ్రామాల్లో 16, బ్రహ్మళకుంటలో 17 మంది పేర్లు లేకుండా చేశారని, గ్రామాల్లో సర్వే చేసిన తరువాత ఆమోదించిన తీర్మానం ప్రకారం ప్రతి గిరిజనుడికి పట్టాదారు పాసు పుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, మండల కమిటీ సభ్యులు మిట్టపల్లి నాగమణి, కంటే సత్యం, సి ప్రసాద్, కుంజా రాములు, కలకోట అప్పారావు, రాజులు, పద్మం వెంకటేశ్వరరావు, పోతిని సత్యనారాయణ, కుమారు, సున్నం నాగేశ్వరరావు, సున్నం శివ, విశ్వనాథం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: కల్లూరు మండలంలోని 31 పంచాయతీల్లో పనిచేస్తున్న జాతీయ ఉపాధి హామీ కూలీలకు మూడు రోజుల పాటు మజ్జిగ పంపిణీ చేయాలని ఎంపీపీ బీరవెల్లి రఘు కోరారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, పాలెపురామారావు, లక్కినేనిరఘు, లక్ష్మణ్‌రావు, చందర్‌రావు, వెంకటేశ్వరరెడ్డి, ఎండి.ఇస్మాయిల్, కమ్లీ, మల్లేశం, రామకృష్ణ, కె.ప్రసాద్, శ్రీనివాసరావు, అనూష, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు



చిన్నారికి సర్టిఫికెట్ అందజేస్తున్న కౌన్సిలర్

వైరా: వైరా మున్సిపాలిటీ కౌన్సిలర్ మాదినేని సునీత, ప్రసాద్, పరుచూరి కోదండరామయ్య, వీర కుమారి దంపతులు మంగళవారం వైరా రిజర్వాయర్ సమీపంలోని దాసాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఇటీవల వైరా రిజర్వాయర్‌లో నిర్వహించిన ఈత పోటీలలో గెలుపొందిన చిన్నారులకు సర్టిఫికేట్‌లు, బహుమతులు అందజేశారు. స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు చింతనిప్పు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఊరుకొండ వెంకటేశ్వరరావు, రవీంద్రబాబు, సైదులు పాల్గొన్నారు.

బహిరంగసభను విజయవంతం చేయాలి




ఎర్రుపాలెం: మాట్లాడుతున్న సందీశ్వర్ గౌడ్


ఎర్రుపాలెం: మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఖమ్మం పట్టణంలో నిర్వహించనున్న బీజేపీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పఠాన్ చెర్వు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ కోరారు. మంగళవారం మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యులు నూతక్కి నర్సింహారావు అధ్యక్షతన జరిగిన కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శ్రీవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత మోర్చ కార్యదర్శి పెరుమాళ్లపల్లి విజయరాజు, పార్టీ జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు, మండల కమిటీ అధ్యక్షులు ముక్కపాటి శ్రీనివాసరావు, నియోజకవర్గ ఫుల్ టైమర్ రవి చంద్ర, నాయకులు దేవరకొండ కోటేశ్వరరావు, పుప్పాల చంద్రమౌళి, నాగేశ్వరావు, కోటపాటి ధర్మారావు, వెంకటేశ్వరరావు, ఉప్పల ధనుంజయ శర్మ, గరికపాటి పురుషోత్తం పాల్గొన్నారు.

తల్లాడ: కేంద్ర హోం మంత్రి అమిత్ హాజరయ్యే బహిరంగ సభకు భారీ సంఖ్యలో తరలి రావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్ అన్నారు. మంగళవారం తల్లాడ పరిసర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆపతి వెంకటరామారావు అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తూటికుంట్ల రవికుమార్, కొంకటి హరిష్, రాలయ రమేష్, కృష్ణారావు, తేజావత్ బాలాజీ నాయక్, గొల్లమందల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లి : బీజేపీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు బొర్రా నరసింహారావు సమావేశంలో అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ని వీరంరాజు, అధికార ప్రతినిధి మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఒరుగంటి రాము, భవాని శంకర్, ఎస్సీ మోర్చా పేర్ల మహేష్, బూత్ అధ్యక్షులు మారిన్ని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తల్లాడ: మాట్లాడుతున్న ఎర్రం మహేష్



పెనుబల్లి : మాట్లాడుతున్న నరసింహారావు

కేసు నమోదు

చింతకాని: మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన తుడుం నాగయ్య, అతని భార్య మరియమ్మ, కుమారుడు అనిల్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని తుడుం రాజేష్‌కు చెందిన ఆవులను ఈనెల 9న తన సోదరుడు నాగయ్య ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. మూగజీవాలను ఎందుకు ఢీకొట్టావని రాజేష్ భార్య రాజ్‌మేరీ నాగయ్యను ప్రశ్నించగా నాగయ్యతో పాటు భార్య మరియమ్మ, కుమారుడు అనిల్ ముగ్గురు కలిసి అసభ్య పదజాలంతో దూషించారు. రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై పొదిల వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పెనుబల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని లంకపల్లికి చెందిన రాయల నరసింహారావు(40) కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై మంగళవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబీకులు ఆయనను సత్తుపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నరసింహారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉండగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు వీఎం బంజర్ ఎస్సై జి.సూరజ్ తెలిపారు.

మహిళల సంక్షేమమే ధ్యేయం

ఘనంగా మహిళా సంక్షేమ దినోత్సవం

- జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, ఎమెల్యేలు సండ్ర, రాములునాయక్



సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



మధిర: విజయలక్ష్మిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్



ఏన్కూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్



ఎర్రుపాలెం: జమలాపురం ఆలయంలో మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న ఈఓ, అర్చకులు

మధిర: రాష్ట్రంలో మహిళల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రెడ్డి గార్డెన్స్ కల్యాణ మండపంలో మహిళల సంక్షేమ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను, వివిధ రకాల కూరగాయలతో ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సన్మానించారు. ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తగా ఎంపికైన లంకెల విజయలక్ష్మిని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రవీంద్రనాథ్, ఎంపీపీ లలిత, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత వెంకటరెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ శారదా శాంతి, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం కేసీఆర్

సత్తుపల్లిటౌన్: ఆడబిడ్డల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సీఎం కేసీఆర్ మహిళా పక్షపాతిగా నిలిచారని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సత్తుపల్లిలోని శ్రీలక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మహిళా సంక్షేమ దినోత్సవ సంబురాలను నిర్వహించారు. ఐసీడీఎస్ ఉద్యోగులు మిల్లెట్లతో తయారు చేసిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉత్తమ మహిళా ఉద్యోగులను, ప్రజాప్రతినిధులను సత్కరించారు. నియోజకవర్గంలోని 146 స్వయం సహాయక సంఘాలకు రూ.11.87 కోట్లు బ్యాంకు లింకేజీలను అందించారు. కల్లూరు ఆర్డీఓ సూర్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఈఈ హేమలత, ఎఫ్‌డీఓ మంజుల, కమిషనర్ కె.సుజాత, ఎంపీడీఓ సుభాషిణి, సీడీపీఓలు కె.కొండమ్మ, కృష్ణకుమారి, ఎంపీపీలు దొడ్డా హైమావతి, లక్కినేని అలేఖ్య, మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాత, మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అండగా ..

ఏన్కూరు: తెలంగాణ ముఖ్యమంత్రి ఆడబిడ్డలకు అండగా ఉన్నారని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. స్థానిక కమ్మవారి కల్యాణ మండపంలో వైరా నియోజకవర్గస్థాయిలో ఐసీడీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో మహిళ సంక్షేమ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు రూ 3.50 కోట్ల చెక్కును అందజేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ స్నేహలత, ట్రైనీ కలెక్టర్ రాధిక గుప్తా, ఐసీడీఎస్, ఐకేపీ సభ్యులు, ఆశ కార్యకర్తలను, ప్రజాప్రతినిధులను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో వైరా మాజీ ఎమ్మెల్యే బాణోతు చంద్రావతి, జెడ్పీటీసీలు బాదావత్ బుజ్జీ, నంబూరి కనకదుర్గ, ఎంపీపీలు అరెం వరలక్ష్మి, వేల్పుల పావని, కుంతల, సర్పంచ్‌లు సిద్రా రుక్మిణి, భూక్యా కాంతి, తహసీల్దార్‌లు నారపొగు అరుణ, ఎండీ. ముజాహిద్, శారద, ఎంపీడీఓలు బయ్యారపు అశోక్, వెంకటేశ్వరావు, ఎస్సై బాదావత్ రవి, సీడీపీఓ దయామణి, సూపర్‌వైజర్లు వెంకటామ్మ, రేఖాబాయి, ఏపీఎం హరినారాయణ, నాయకులు నల్లమల వెంకటేశ్వరావు, బాణోతు సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జమలాపురంలో మహిళా ఉద్యోగులకు సన్మానం

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతి జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ సీనియర్ అసిస్టెంట్ కె విజయ కుమారితో పాటు మహిళా ఉద్యోగులను ఈఓ కె జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ ఘనంగా సత్కరించారు.

వైఎస్సార్ హయాంలో 'పోడు' పట్టాలు



మాట్లాడుతున్న రామ్మూర్తి నాయక్

ఏన్కూరు: పోడు భూములను పట్టాలు ఇచ్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు దక్కుతుందని టీపీసీసీ సభ్యుడు రామ్మూర్తి నాయక్ అన్నారు. స్థానిక ఠాగూర్ కల్యాణమండపంలో మంగళవారం ఎల్‌డీయం కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎందరో అమరువీరుల త్యాగాలను కేసీఆర్ మర్చిపోయారన్నారు. నిరుద్యోగ యువతను పట్టించుకోవడం లేదని, పోడు భూములకు పట్టాలు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువతను ప్రోత్సహించేందుకు ఎల్‌డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగేష్, ఉప్పెర్ల ఆనందప్రసాద్, వక్కంతుల నాగార్జున, నర్సింహరావు, నిమ్మల నరేందర్, అంజన్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

ఏన్కూరు: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో నేడు విద్యుత్ వినియోగదారులు సదస్సు నిర్వహిస్తున్న ట్రాన్స్‌కో చైర్ పర్సన్ పి.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సమస్యలపై వినియోగదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

వరి సాగుపై అవగాహన

తల్లాడ: మండలంలోని వెంగన్నపేట గ్రామంలో వరిసాగుపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎండి.తాజుద్దీన్ మాట్లాడుతూ.. మూడేళ్లుగా అకాల వర్షాలు, వడగండ్ల వానలు, ఈదురుగాలులతో నష్టం వాటిల్లుతోందని, నష్టాలను అధిగమించడానికి వేరే పంటలను ముందస్తుగా సాగు చేయాలన్నారు. నాగేశ్వరరావు, ప్రసాద్, మాధవరావు పాల్గొన్నారు.

హమాలీ కూలి రేట్లు పెంచాలి



మాట్లాడుతున్న పుల్లారావు

కల్లూరు: కల్లూరు ప్రాంతంలో ఉన్న రైస్ మిల్లులలో హమాలీ కార్మికులకు కూలిరేట్లు పెంచాలని ఖమ్మం జిల్లా హమాలీల సంఘం అధ్యక్షుడు ఖమ్మంపాటి పుల్లారావు కోరారు. కల్లూరు రైస్ మిల్లుల మేస్త్రీల సమావేశం మంగళవారం బి.సత్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ... గతంలో రైస్ మిల్లుల యజమానులకు, హమాలీ సంఘం ప్రతినిధులకు మధ్య కుదిరిన హమాలీ కూలిరేట్ల ఒప్పందం ముగిసిందన్నారు. అగ్రిమెంట్ కాల పరిమితి ముగిసి మూడు నెలలు దాటుతున్నా హమాలీలకు కూలి రేట్లు పెంచడానికి మిల్లర్లు ముందుకు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు వెంకన్న, నాయకులు సత్యం, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, పిచ్చయ్య, అంజన్‌రావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహాల ప్రతిష్ఠ



అమ్మవార్లకు పసుపు, కుంకుమలు తీసుకెళ్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సమ్మక్క, సారలమ్మ, ఎల్లమ్మ దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. గద్దెలపై కొలువైన అమ్మవార్లకు అర్చకులు వెదురు నాగిరెడ్డి, అన్ని వర్గాల మహిళలు పుట్టిల్లు, అత్తవారి ఇళ్ల తరపున పసుపు, కుంకుమ, ఒడి బియ్యం సమర్పించి పూజలు నిర్వహించారు.